ప్రజాశక్తి

సోమవారం 21 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ డెయిరీ దొంగ దెబ్బ

◆ ఆవు పాల సేకరణ ధర రూ.3 తగ్గింపు ◆ ఏడాదికి రూ.64.80 కోట్లు ఆదా
◆ పాల కేంద్రాల్లో ధరల ప్రదర్శనలో గోప్యత ◆ పాల రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కె.కోటపాడు విలేకరి

విశాఖ డెయిరీ దాదాపు 2.50 లక్షల మంది పాల రైతులను దొంగదెబ్బ కొట్టింది. పెరిగిన పశువుల దాణా ఖర్చులకు తగినట్లు పాల ధరను రైతులకు చెల్లించకుండా ఆవు పాల సేకరణ ధరను తగ్గించింది. ఆ సమాచారం రైతులకు తెలీకుండా దాచిపెట్టింది. వాస్తవానికి పాల ధరలు రైతుకు తెలిసేలా పాల కేంద్రాల వద్ద ప్రదర్శించాలి. ఆవు పాల ధర తగ్గించిన సమాచారం బయటకు తెలీకుండా ఈ నెల 16 నుంచి కొత్త ధరలు అమలు చేస్తోంది. ఆవు పాల ధర లీటర్‌కు మూడు రూపాయలు తగ్గించి, గేదె పాలు లీటర్‌కు మూడు రూపాయలు పెంచినట్లు రైతులు చెబుతున్నారు. డెయిరీ యాజమాన్యం మాత్రం తగ్గించిన ఆవుపాల ధర, పెంచిన గెదె పాల ధరను గోప్యంగా ఉంచుతోంది. ఆవు పాల సేకరణ ధరను తగ్గించడంతో విశాఖ డెయిరీకి ఏడాదికి రూ.64.80 కోట్లు ఆదా అవుతుంది.



గణపర్తిలో నిరసన తెలుపుతున్న పాడి రైతులు, రైతు సంఘం నాయకులు

ఒకవైపు విశాఖ డెయిరీ పశువుల దాణా ధర పెంచింది. మరోవైపు రైతుకు బోనస్ ఇవ్వకుండా దాటేసుకుంటూ మిగతా 2లో..

పాత ధర చెల్లించాలి



విశాఖ డెయిరీకి రోజుకు 12 లీటర్లు ఆవు పాలు పోస్తున్నాను. మూడు రూపాయలు తగ్గించడంతో 36 రూపాయలు నష్టపోతున్నాను. తవుడు, నూకలు, విశాఖ డెయిరీ సరఫరా చేస్తున్న దాణా రేట్లు పెరిగాయి. కానీ పాల ధర పెంచలేదు సరికదా తగ్గించడం అన్యాయం. పాత ధర చెల్లించాలి.

శిలపరశెట్టి ముసలినాయుడు, చౌడువాడ, పాల సొసైటీ మాజీ డైరెక్టర్

జాబ్ మేళాలతో ఉపాధి అవకాశాలు

◆ ప్రైవేట్ సంస్థల్లో ఖాళీల భర్తీని పెద్ద ఎత్తున చేపడుతున్నాం
◆ అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో క్రమం తప్పకుండా నిర్వహణ
◆ 'ప్రజాశక్తి'తో విశాఖ జిల్లా ఉపాధి కల్పనా అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



జాబ్ మేళాలతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు విశాఖ జిల్లా ఉపాధి కల్పనా అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. చదువుకున్న వారందరికీ వారి వారి అర్హతలను బట్టి ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం జాబ్ మేళాలను ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



జాబ్ మేళాలను ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు ? స్పందన ఎలా ఉంది ?

ఈ ఏడాది జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30 వరకూ ప్రతి నెలా క్రమం తప్పకుండా జాబ్ మేళాలను విశాఖపట్నం జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ ఉపాధిని కల్పించే సంస్థలు సుమారు 186 పాల్గొన్నాయి. 8116 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో ఇప్పటివరకూ 2402 మందిని వివిధ కంపెనీలకు సెలక్టు చేసి పంపడం జరిగింది. ఇంకా అనేక మందికి కాల్ లెటర్‌లు, జాబ్ ఆఫర్ చేస్తూ లెటర్‌లు పంపిస్తున్నాం.

జాబ్ మేళాలో పాల్గొన్న వారందరికీ ఏదో ఒక స్థాయి ఉపాధి లభిస్తుందా?

వారి వారి అర్హతా పత్రాలన్నింటినీ జాబ్ మేళాల సందర్భంగా స్వీకరిస్తున్నాం. పలు ఐటి కంపెనీలు, ఫార్మా కంపెనీలు, మిగతా 2లో..

వార్త 2లో..



సభలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

మొదటి పేజీ తరువాయి..

విశాఖ డెయిరీ దొంగ దెబ్బ

వస్తోంది. వీటికి తోడు గుట్టుచప్పుడు కాకుండా పాలుపోసిన రైతు జేబు కొట్టే పనికి సిద్ధపడింది. ప్రతి రోజూ విశాఖ డెయిరీకి ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని 2.50 లక్షల మంది రైతులు 7.50 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు. డెయిరీ సేకరిస్తున్న పాలలో ఆవు పాలు ఆరు లక్షల లీటర్లు, గేదె పాలు లక్షన్నర లీటర్లు వున్నాయి.

ఆరు లక్షల లీటర్ల ఆవుపాలకు మూడు రూపాయలు తగ్గించడంతో రోజుకు 18 లక్షలు, నెలకు రూ.5.40 కోట్లు, ఏడాదికి రూ.64.80 కోట్లు డెయిరీకి మిగులుతోంది. లక్షన్నర లీటర్ల గేదె పాలకు లీటర్‌కు మూడు రూపాయలు చొప్పున పెంచడంతో రోజుకు రూ.4.50 లక్షలు, నెలకు రూ.1.35 కోట్లు, ఏడాదికి రూ.16.20 కోట్లు అదనంగా చెల్లించాల్సివుంటుంది. ఆవు పాలకు మూడు రూపాయలు తగ్గించడంతో ఆదా అయిన రూ.64.80 కోట్లలో గేదె పాలకు మూడు రూపాయలు చొప్పున పెంచిన ధరతో ఏడాదికి రూ.16.20 కోట్లు పోయినా ఇంకా యాజమాన్యానికి రూ.48.60 కోట్లు మిగులుతోంది. ఈ మిగులు నిధులతో పాల రైతుకు బకాయి బోనస్ చెల్లించాలన్న ఆలోచనలో యాజమాన్యం వున్నట్లు తెలుస్తోంది. తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డెయిరీ యాజమాన్యం రైతుకు బోనస్ చెల్లించి ఆ అప్రతిష్టను తొలగించుకోవాలని చూస్తోంది. ఆవు పాల ధర తగ్గించడంతో పాల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ డెయిరీ పాల ధరలు తక్కువగా వుండడంతో ప్రయివేటు డెయిరీల వైపు పాల రైతులు మొగ్గు చూపుతున్నారు. విశాఖ డెయిరీకి రోజుకు 20 లీటర్ల ఆవుపాలు పోసిన మునగపాకకు చెందిన దాడి వీరబాబు 60 రూపాయలు నష్టపోతున్నట్లు తెలిపాడు. దీంతో విశాఖ డెయిరీకి పాలుపోయడం మానేసి ప్రయివేటు డెయిరీకి పాలు పోస్తున్నట్లు చెప్పాడు. విశాఖ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌వి.రమణ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ పాల రైతుకు బోనస్ చెల్లించేందుకు ఆవు పాల ధరను సొసైటీలు తగ్గించాయని తెలిపారు. తగ్గించిన పాల ధరతో వచ్చిన ఆదాయాన్ని బోనస్ కింద సొసైటీలు చెల్లిస్తాయన్నారు. ఆవు పాల ధరను డెయిరీ తగ్గించలేదని తెలిపారు.

పాల ధర రూ.50కు పెంచాలి



లీటర్ ఆవు పాలకు 50 రూపాయలు పెంచితేగానీ రైతుకు గిట్టుబాటు కాదు. ఆ రేటు ఇవ్వకపోగా తగ్గించింది. భార్యాభర్తలు కష్టపడి రెండు ఆవులను మేపుకుంటేగానీ రోజుకు పది లీటర్లు పాలు పోయలేం. పాల రేట్లు తగ్గిస్తే పశువులు అమ్ముకోవడం తప్ప వేరే దిక్కులేదు.

వమ్మి అప్పలనాయుడు, పాల రైతు, చౌడువాడ

ధర పునరుద్ధరించకపోతే ఆందోళన



తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించి రైతుకు చెల్లించాలి. బోనస్ పాల రైతులందరికీ ఇవ్వాలి. ఇతర డెయిరీల కంటే ఎక్కువ ధర చెల్లించి పాల రైతును విశాఖ డెయిరీ ప్రోత్సహించాలి. దాణా ధరలు తగ్గించాలి. పాల ధరల వివరాలు కేంద్రాల్లో ప్రదర్శించాలి. పాల రైతుకు పాత ధరల ప్రకారం బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేపడతాం.

కర్రి అప్పారావు,
ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

జాబ్ మేళాలతో ఉపాధి అవకాశాలు

ఇతర ప్రైవేట్ ఆర్గనైజేషన్స్ నుంచి అవసరాలున్నాయన్న సమాచారం వచ్చే సందర్భంలో ఏ పోస్టుకు ఎవరిని పంపాలన్న ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకుంటాం. ప్రాధాన్యతలు, అర్హతలను బట్టి నియమాకాలకు పంపిస్తున్నాం. ఇలా ప్రైవేట్ సంస్థల్లోనే పెద్ద ఎత్తున ఉపాధిని ప్రోత్సహిస్తున్నాం.

ఎంపిక విధానం ఎలా జరుగుతోంది ?

ఒక ఉద్యోగానికి ఫలానా వ్యక్తి అర్హతలు సరిపోతాయని భావిస్తే వెంటనే స్కిల్ డవలప్‌మెంట్‌ను కూడా ఎంప్లాయ్‌మెంట్‌తో కలిపే నిర్వహించే ప్రక్రియను చేపడుతున్నాం. స్కిల్ డవలప్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ వేర్వేరుగా చేయడం లేదు. ఇది నిరుద్యోగ యువతకు ఎంతగానో తోడ్పాటునిస్తుంది. గతంలో ఇలా రెండింటినీ మిళితం చేసి ఇవ్వనందున యువత ఉపాధికి దూరమయ్యారు.

జాబ్ మేళాలకు వచ్చే వారి అర్హతలు ఎలా ఉంటున్నాయి ?

పదో తరగతి మొదలుకొని బిటెక్, పిజి వరకూ పెద్ద సంఖ్యలో చదువుకున్న నిరుద్యోగులు మేళాలకు హాజరవుతున్నారు. ప్రతి నెలా విశాఖ జిల్లాలో 7 మేళాలు నిర్వహిస్తున్నాం. ఒక మేళాకు 450 నుంచి 500 మంది హాజరవుతున్నారు. అంటే సుమారు 4 వేల మంది ఏకకాలంలో మేళాల్లో పాల్గొంటున్నారు. జాబ్‌మేళాలన్నీ సక్సెస్ దిశగా వెళ్తున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వం జారీచేసే సూచనలను బట్టి ఇంకా ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషిచేస్తాం.

బీచ్ రోడ్‌లో మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ భారత్ నివేస్ రన్ పేరిట 5 కిలోమీటర్ల ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాలు అక్టోబర్ 14 - 20 వరకు భారతదేశంలో జరుగుతున్న నేపథ్యంలో ఈ ర్యాలీని నిర్వహించినట్టు ప్రతినిధి వెంకటేష్ చలసాని తెలిపారు. ఈ ర్యాలీలో 3080 మంది పాల్గొన్నారని చెప్పారు.

ఆర్థరైటిస్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్థరైటిస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఆదిత్య కృష్ణ అన్నారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆర్థరైటిస్‌లో అత్యంత సాధారణమైన ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, సోరియాటిక్ ఆర్థరైటిస్, గౌట్ ఉన్నాయని తెలిపారు. ఆస్టియో ఆర్థరైటిస్ కీళ్లు అరిగిపోవడం వల్ల వస్తుందని అన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ ఆధీనంలో విద్య ఉండడం ద్వారానే సమాజంలో నైతిక విలువలు, ప్రజాతంత్ర హక్కులు నిలబెట్టుకోగలమని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకొనే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగాయి. మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన యుటిఎఫ్ ప్రభుత్వ రంగ బలోపేతానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎన్నో పోరాటాలు సలిపిందని గుర్తుచేశారు. పాలక వర్గాల నిర్బంధాలను, కేసులను తట్టుకుని నిలబడిందని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాట మార్గాన్ని ఎంచుకుందన్నారు. పాలక వర్గాలు ఏవైనా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, ప్రజల పక్షాన నిలబడి వారి పోరాటాలకు అండగా నిలబడిన ప్రజా సంఘంగా పేరు తెచ్చుకుందన్నారు. పాలక వర్గాల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ బలహీన పడిందని, దీనిని బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వ బడిని బతికించుకోవడానికి బడి సమయం కంటే అదనంగా ఒక గంట పనిచేయాలని పిలుపునిచ్చారు. సభకు సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభను సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్.మోహనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ స్థాపనలో జీవితాలను ఫణంగా పెట్టిన అమరవీరుల త్యాగాలను స్మరించుకొంటూ భవిష్యత్ ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. సంఘం మరో రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ అన్ని యాజమాన్య ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ అగ్రభాగాన ఉందని తెలిపారు. ట్రైబల్, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. మహాసభల ప్రారంభ సూచకగా యుటిఎఫ్ జెండాను సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి ఆవిష్కరించారు. మహాసభలో గతంలో పనిచేసిన యుటిఎఫ్ సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగేశ్వరరావు, అంబేద్కర్



యుటిఎఫ్ విశాఖ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలో విశాఖ జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి వ్యవహరించారు. గౌరవాధ్యక్షులుగా అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులుగా ఎన్.ప్రభాకర్, రొంగలి ఉమాదేవి, కోశాధికారిగా కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులుగా చుక్క సత్యం, ఉప్పాడ రాము, మహ్మద్ రిజ్వాన్, రియాజ్ అహ్మద్, వంగా రామలక్ష్మి, టి.జగన్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎమ్.రవిబాబు, కౌన్సిలర్‌గా ఎస్ఎస్.నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

భూపేష్ నగర్‌లో మద్యం షాపు వద్దు



వైన్ షాప్ ఏర్పాటు స్థలంలో నిరసన తెలుపుతున్న మహిళలు

మహిళల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం భూపేష్‌నగర్‌లో మరొక మద్యం షాపును ఏర్పాటు చేయొద్దంటూ మహిళలు నిరసన తెలిపారు. ఈ ప్రాంతంలోని మెడికల్ షాపును తొలగించి అందులో మద్యం షాపును తెరవడం కోసం ప్రయత్నాలు జరుగుతున్న విషయం తెలియడంతో అక్కడ మహిళలు ఆదివారం మద్యం షాపు తెరవనున్న ప్రదేశంలో బ్యానర్ కట్టి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మేరీ, పద్మ మీడియాతో మాట్లాడుతూ తమ కాలనీకి వెళ్లే మార్గంలో చావుల మదుం ప్రాంతంలో ఈసరికే రెండు బార్లు, రెండు మద్యం షాపులు ఉన్నాయని, అవి చాలవన్నట్లు ఇప్పుడు మరొక మద్యం షాపును తమ కాలనీకి దగ్గరగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. దీనిని తాము అంగీకరించేది లేదన్నారు. అదిగాక ఈ ప్రాంతంలో సెవెంత్ డే స్కూలు, ఒక గుడి, ఒక మసీదు కూడా ఉన్నాయని, వీటికి దగ్గరగా మద్యం షాప్ తెరవకూడదని నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌కె.మహబూబా తదితరులు పాల్గొన్నారు.

గాలిలో దీపంలా ఆడపిల్లల ప్రాణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కూటమి ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు, హత్యలు ప్రమాదకర స్థాయికి చేరాయని, ఆడపిల్లల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయని వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఆదివారం సాయంత్రం సిరిపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా ? సిఎం ఉన్నారా ? అని ఆమె మండిపడ్డారు. వరుసగా అత్యాచార ఘటనలు, దారుణ హత్యలు జరుగుతున్నా హోం మంత్రిగానీ, ఆడపిల్లల రక్షణకు కంకణం కట్టుకున్నానని ప్రకటించిన డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌గానీ స్పందించడం లేదని దుయ్యబట్టారు.

కనకమహాలక్ష్మి బ్యాంకుకు మూడు అవార్డులు



అవార్డులు అందుకుంటున్న బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకుకు బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ నిర్వహించిన అవార్డుల ఉత్సవంలో మూడు విభాగాలలో ఉత్తమ నిర్వహణ అవార్డులు లభించాయి. ఇటీవల లక్నోలో నిర్వహించిన బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ ఎన్‌సిబిఎస్ అండ్ ఎఫ్‌సిబిఎ కాన్ఫరెన్స్ -2024లో ఈ అవార్డులను బ్యాంకు అధికారులు వీరేంద్రప్రసాద్, సాయిచరణ్ అందుకున్నారు. ఉత్తమ సైబర్ సెక్యూరిటీ, ఉత్తమ క్రెడిట్ ఇనిషియేటివ్, ఉత్తమ వార్షిక రిపోర్టు విభాగాలలో ఈ అవార్డులు లభించాయి. అవార్డులు లభించడం వెనుక పాలకవర్గం సహకారం, సిబ్బంది కృషి ఎంతో ఉందని బ్యాంకు ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు. బ్యాంకుకు కొన్నేళ్లుగా వరుసగా ప్రతి సంవత్సరం బ్యాంకింగ్ ఫ్రంటిరియర్స్ అవార్డులు లభించడం సంతోషంగా ఉందని బ్యాంకు ముఖ్య కార్య నిర్వాహణాధికారి కె.శ్యామ్ కిషోర్ అన్నారు. పాలకవర్గం సహకారంతో, సిబ్బంది కృషితో రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ కేంద్రంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 32 శాఖలతో ఖాతాదారులకు సత్వర సేవలందిస్తున్న తమ బ్యాంకు రానున్న రోజుల్లో నగరంలోని విశాలాక్షినగర్ మెయిన్ రోడ్డులో నూతన శాఖతో పాటు మరిన్ని శాఖలను ప్రారంభించనున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు.

శారదా పీఠానికి కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవాలి



శారదా పీఠానికి కేటాయించిన స్థలంలో హర్షం వ్యక్తం చేస్తున్న విదసం ప్రతినిధులు

ప్రజాశక్తి -యంత్రాంగం
భీమునిపట్నం : స్థానికంగా కొండపై గత ప్రభుత్వం శారదా పీఠానికి కేటాయించిన రూ.వందల కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని తక్షణమే కూటమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని విదసం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. శారదా పీఠానికి సంబంధిత భూ కేటాయింపులు రద్దు నిర్ణయం హర్షణీయమన్నారు. వైసిపి అధినేత గెలుపు కోసం గతంలో యాగం చేసినందుకు క్విడ్ ప్రో కో పద్ధతిలో వందల కోట్ల విలువైన భూమిని గత ప్రభుత్వం స్వరూపానందకు కట్టబెట్టిందని ఆరోపించారు. ఈ సందర్భంగా సంబంధిత స్థలంలో నీలి జెండాను ఎగురవే శారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సుజాత, సుధాకర్, ఓంకార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతికి గత వైసిపి ప్రభుత్వం కేటాయించిన 15 ఎకరాల భూమిని కూటమి ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ కోరారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శారదాపీఠానికి కేటాయించిన భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంలో తెలుగు శక్తి చేపట్టిన పోరాటానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఒక పీఠానికి అధిపతి అనే సంగతిని విస్మరించి గత వైసిపి ప్రభుత్వానికి రాజ గురువులా స్వరూపానందేంద్ర మారారని విమర్శించారు. 15 ఎకరాల భూమిని అతి తక్కువ ధరకే కొట్టేయడం, మరోవైపు తెలంగాణలోని కోకాపేటలో రెండు ఎకరాల భూమిని అప్పటి కెసిఆర్ ప్రభుత్వం నుంచి దక్కించు కోవడం స్వరూపానందకే చెల్లిందన్నారు. 15 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవడం ఒక చారిత్రక ఘట్టం అని హర్షం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో విశాఖ జిల్లా టిడిపి కార్యదర్శి బోడేపూడి దొరబాబు, బిసి సెల్ నాయకులు దువ్వి పరమేశ్వరరావు, కె.నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బర్మా క్యాంపు ప్రాంతానికి చెందిన రావాడ ఈశ్వరరావు, భార్య రావాడ సంతోషి (36) కలిసి ద్విచక్రవాహనంపై ఎండాడలో బంధువుల ఇంట్లో జరిగే ఫంక్షన్ నిమిత్తం వెళ్తున్నారు. నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో వెనుక కూర్చున్న సంతోషి కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రావాడ ఈశ్వరరావుకు గాయాలయ్యాయి. కళ్లముందే భార్య మృతితో ఈశ్వరరావు బోరున విలపించారు. ఆయన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ వాణిశ్రీ కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

బోయ/వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనంతపురంలో జరిగిన వాల్మీకి జయంతి కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బోయ/వాల్మీకిలను ఎన్నికల వాగ్దానం మేరకు ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపుతామని చెప్పడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కిముడు చిన్నంనాయుడు, గసాడి రమణమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులు ఉల్లి బొంజుబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం బోయ/వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చే ప్రయత్నాన్ని విరమించాలని, కాదని గిరిజన జాబితాలో చేరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28 లక్షల మంది ఆదివాసీల ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మంత్రి సవిత ప్రకటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

విశాఖపట్నం - రాయపూర్ రైలు వేళలు మార్పు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల విశాఖపట్నంలో జరిగిన వాల్తేర్ డివిజన్ డివిజనల్ కమిటీ సమావేశంలో ప్రజాప్రతినిధులు, పార్లమెంట్ సభ్యులు చేసిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ ప్రయాణికుల అవసరాల దృష్ట్యా విశాఖపట్నం - రాయపూర్ పాసింజర్ రైలుకు సమయాలు సవరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 20 నుంచి అమలులోకి రానున్నాయి. సవరించిన సమయాల ప్రకారం 08528 విశాఖపట్నం - రాయపూర్ పాసింజర్ రైలు ఉదయం 6.30 గంటలకు బదులు 4.25 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి సింహాచలానికి 4.43కి, కొత్తవలసకు 5.05కి, విజయనగరానికి 5.50కి, బొబ్బిలికి 7.08కి, పార్వతీపురానికి 7.40కి, పార్వతీపురం టౌన్‌కి 7.48కి, రాయగడకు 9.15కి, మునిగూడకు 11.00కి, కేసింగాకు 12.32కి, టిట్లఘర్‌కు 13.00కి, మహసముండ్‌కు 17.00కి, రాయపూర్‌కు రాత్రి 19.45 గంటలకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే బోటు షికారు

చింతపల్లి :- ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి, తాజంగి జలాశయంలో బోటు షికారు పర్యాటకులకు ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. ఆదివారం మండలంలో పర్యటించిన ఆయన తాజంగి జలాశయంలో బోటు షికారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులు తాజంగి అందాలను తిలకించి బోటు షికారు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు.

గుంతలతో బిపి కల్లాలు రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని బంటుపల్లి వారి కల్లాలు గ్రామపంచాయతీ పరిధిలో కల్లాల నుంచి చందక వారి కల్లాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తోంది. ఈ రోడ్డుకు గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనా నేటికీ పనులు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సుమారు 800 మీటర్ల రోడ్డు పూర్తి అధ్వాన స్థితిలో ఉన్నా పనులు చేయకపోవడం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు. ఈ రోడ్డులో గుంతలు వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రోడ్డు మరీ అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా రోడ్డు పనులను ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రహదారిపై నీరు చేరిన గుంతలు

ఉపకార్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉపకార్ కప్ -2024 సీజన్-2 మెగా క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఆరిలోవ హెల్త్‌సిటీ మైదానంలో ప్రారంభమైంది. ఈ టోర్నీని ఉపకార్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ప్రారంభించారు. ఇరు జట్లు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన కొంత సేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపకార్ కప్ సీజన్ -1 విజయవంతంగా నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో సీజన్ -2లో రాష్ట్ర స్థాయి ప్రతిభ కలిగిన ఆటగాళ్లతో టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా వారి దృష్టిని ఆటల వైపు మళ్లించేందుకు క్రీడలు ఎంతగానో దోహద పడతాయన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం, యువతలో ఐక్యత పెంపొందించేందుకు కూడా ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 29న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో టోర్నీ విజేతలుగా నిలిచిన జట్టుకు రూ.1.20 లక్షలు, రన్నర్ జట్టుకు రూ.60 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.30 వేలు ప్రైజ్ మనీగా అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్ సుధీర్, రెహ్మాన్, నాగు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డితో ఉత్తరాంధ్రలో వైసిపికి పూర్వ వైభవం

డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ ఇన్చార్జిగా రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి నియమితులు కావడం వల్ల ఉత్తరాంధ్రతో పాటు విశాఖ నగరంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయసాయిరెడ్డి నియామకం అభినందనీయం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. వైసిపి అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డికి మంచి పేరు వచ్చేలా కృషిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వైసిపి నేత, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మాజీ చైర్మన్ అల్లాడ కృష్ణ మాట్లాడుతూ, విజయసాయిరెడ్డిని జగన్ నియమించడం వచ్చే ఎన్నికల్లో గెలుపునకు నాంది అన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధి వికలాంగులకాలనీలో మద్యం దుకాణం వద్దు అని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, కాలనీకి ఆనుకొని మద్యం దుకాణం వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందని, దుకాణం ఇక్కడ నుంచి తరలించాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

24న ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఐక్య రాజ్యసమితి 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 24వ తేదీన ఎంవిపి.కాలనీలోని ఎస్‌విపి డిగ్రీ కళాశాలలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, బివి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థల ఆధ్వర్యాన నిర్వహిస్తున్నామని రిలీజియస్ ఫ్రీడమ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సమితి పనితీరు, సంస్కరణల ఆవశ్యకత అంశాలపై వక్తలు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.జగదీశ్వరరావు, డాక్టర్ బాబ్జి, డాక్టర్ కెవిఎస్.మూర్తి తదితరులు పాల్గొని అవగాహన కల్పిస్తారని తెలిపారు.

గోస్తనీపై వంతెన పనులకు వినతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం గోస్తనీపై వంతెన నిర్మాణ పనులు పున ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు ప్రజా దర్బార్‌లో వినతి పత్రం అందజేసినట్టు టిడిపి నాయకులు పూసర్ల రామారావు ఆదివారం తెలిపారు. వంతెన నిర్మాణం ఆవశ్యకతను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వంలో దివీస్ సంస్థ ముందుకు వచ్చిందని, శంకుస్థాపన కూడా చేశారని వివరించారు. వెంటనే నిర్మాణ పనులు పున ప్రారంభించే లా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్‌ను కోరినట్టు రామారావు తెలిపారు. మంత్రి లోకేష్‌ను కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో టిడిపి నాయకులు పల్ల రామారావు, డి.సురేష్, పి.పోతురాజు, కె.రామకృష్ణ తదితరులు ఉన్నారు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ సుమారు వంద మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్ర మూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ మహిళా కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నామని ఆ విభాగం జిల్లా అధికారి చాముండేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేళాలో శ్రీ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఇన్నోసోర్స్, ఎస్‌బిఐ కార్డ్స్, డీ-మార్ట్ తదితర సంస్థలు పాల్గొంటాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందని, విశాఖ కేంద్రంగా ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలిపారు.



అవార్డు అందుకుంటున్న బూసి వెంకటస్వామి

బూసి వెంకటస్వామికి అబ్దుల్‌కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికిచ్చే డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి అందుకున్నారు. గుంటూరు ఎసి కళాశాల ఆడిటోరియంలో ఎస్‌పిఎల్‌టిఒ (సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యాన ఆదివారం జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు ప్రధానం చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఎసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.మోజేష్, మలినేని విద్యాసంస్థల డైరెక్టర్ మలినేని పెరుమాళ్ళు, మెప్మా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, అప్సా డైరెక్టర్ మేకల రవీంద్రబాబు అవార్డును అందజేశారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న బూసి వెంకటస్వామిని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, తెలుగు విభాగ ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు, తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలియజేశారు.



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జగ్గు సెంటర్ వద్ద గాజువాక క్లబ్‌లో వేదిక పేరుతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కల్యాణ మండపాలను లాభాపేక్షతో పని చేయకూడదని, సేవా దృక్పథంతో నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, క్లబ్ అధ్యక్షులు చిక్క సత్యనారాయణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

'ఆడారి కుటుంబంపై విచారణ చేపట్టాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ డెయిరీలో అవినీతిపై ఆడారి ఆనంద్, ఆయన కుటుంబ సభ్యులపై సమగ్ర విచారణ చేపట్టాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ డెయిరీ ఒక సొసైటీ అని, రైతుల కోసం నిర్మించిన డెయిరీ పేరు చెప్పి రూ.వందల కోట్లను ఆనంద్ కుమార్ దోచుకున్నారని ఆరోపించారు. ఆయన కుటుంబ సభ్యులు డెయిరీ పేరు మీద రూ.లక్షలు జీతాలు తీసుకుంటూ దోచుకున్నార అన్నారు. గత ఎన్నికల సమయంలో ఉత్తరాంధ్ర నుంచి పోటీచేసిన వైసిపి అభ్యర్థులకు డెయిరీ ద్వారా ఒక్కొక్కరికి రూ.5 కోట్లు చొప్పున డబ్బు ఇచ్చినట్లు ఆయన ఆరోపించారు. విశాఖ డెయిరీలో అవినీతిపై పూర్తి విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 59వ వార్డు హనుమాన్‌నగర్‌లోని శ్రీ అభయాంజనేయ ఆలయ 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో 60వ వార్డు కార్పొరేటర్ పివి.సురేష్, 59వ వార్డు వైసిపి ప్రెసిడెంట్ రేవళ్ల సత్యనారాయణ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పివి.సురేష్‌ను, సత్యనారాయణను ఆలయ అధ్యక్షులు రొంగలి ప్రసాద్, గ్రామ అధ్యక్షులు కెఆర్.స్వామి సత్కరించారు. ఈ కార్యక్రమంలో లాలం రాము, లోకేష్, చిన్న, తిరుపతి, చంద్రరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలని సిపిఎం ధర్నా



రైతు బజారు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, చిన్నారులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పిఎఫ్ కార్యాలయం సమీపంలోని రైతు బజారు వద్ద బంగారు వర్ణంతో ఉన్న కూరగాయల బొమ్మలతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా అందివ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు బంగారంకంటే ఎక్కువ ధరలు పలుకుతున్నాయని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వాల హయాంలో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. ఉప్పులు, పప్పులు, చింతపండు, బియ్యం, ఉల్లిపాయలు, టమాటా, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయన్నారు. ఏం కొనేటట్టు.. తినేటట్టు జనం లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార ధాన్యాల నిల్వలు ఎఫ్‌సిఐ గొడౌన్లలో బాగా పెరుగుతున్నాయని, వాటిని రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేరళ మాదిరిగా ప్రజా పంపిణీ వ్యవస్థను సమర్థవంతంగా నడపాలన్నారు. పార్టీ జోన్ నాయకులు ఎం.జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు సిహెచ్.సుమిత్ర, ఎం.నాగేశ్వరరావు, కె.హేమలత, యు.ఉమ, కె.అనురాధ, ఆర్.భవాని, ఎస్.శ్రావణ్, కె.శేషగిరి, నర్సింగరావు, ఒ.అప్పారావు, శ్రీనివాసు, ఎస్.సోమేశ్వరరావు, అజయ్, సాయి తేజ, చిన్నారి పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలో కళానగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో సిపిఐ ఆధ్వర్యాన ఇంటింటికీ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, అధికారం ఇవ్వండి ధరలు పెరగకుండా అదుపులో ఉంచుతాం అని ఎన్నికలు ముందు ప్రచారం చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక ప్రజలు నిత్యం వాడుకునే పప్పులు, బియ్యం, వంటనూనె, అపరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా అదుపు చెయ్యకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ, ఎన్.త్రినాథ్, పి.రమణ, షేక్ మసీనా, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజార్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు జి.వామనమూర్తి, పడాల గోవిందు, రావికృష్ణ, ఎన్.మధురెడ్డి, కేలం శివ, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక : కూటమి పాలనలో నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు అన్నారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవనంలో ఆదివారం నియోజకవర్గం సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద ప్రజలు నిత్యవసర సరుకులు కూరగాయలు ధరలు కొనలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, కెంగువ అచ్యుతరావు, పి.దుర్గారావు, కె.వనజాక్షి, పి.పద్మ, పి.సోమేష్ పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి కాకర్లోవ కూడలి, చింతలలోవ గ్రామాలలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమలో కాంగ్రేగుల సత్యాంజనేయ, ఎన్‌వి.త్రినాథ్, డి.గోపి, కామేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచగ్రామాల సమస్యపై వినతులు



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందిస్తున్న కృష్ణంరాజు తదితరులు

ప్రజాశక్తి-పెందుర్తి : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన తూర్పు, భీమిలి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గంటా శ్రీనివాసరావుకు ఆదివారం పంచగ్రామాల కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే వెలగపూడి మాట్లాడుతూ, విజయవాడలో పంచ గ్రామాల భూ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశం జరిగిందని, సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో, అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడానని తెలిపారు. నవంబర్ 6వ తేదీన కోర్టు వాయిదా ఉందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల 25వ తేదీన కలెక్టర్ ఆఫీసులో సమావేశం ఉందని, పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, కోశాధికారి సిహెచ్.సత్యనారాయణ, హనుమంతురావు, కృష్ణారావు, వి.నరసింగరావు, సూర్యనారాయణ, లక్ష్మి, రాంబాబు, రాము పాల్గొన్నారు.



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలో అసాంఘిక కార్యకలాపాలు పెచ్చరిల్లిడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలతో విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బాగ్చీ కార్డన్ సెర్చ్ డ్రైవ్‌కు ఆదేశించారు. డిసిపి -1 అజిత వేజెండ్ల, ఎసిపి లక్ష్మణమూర్తి సూచనలతో ఆదివారం ఉదయాన్నే ఫోర్త్‌టౌన్ సిఐ కె.విజయ్‌కుమార్ సహా వివిధ బృందాలు వరహాగిరినగర్, కైలాసపురం, సత్యసాయినగర్, సాలిగ్రామపురం, సింహగిరి కాలనీ, లెప్రసీ కాలనీ, ఎంఇఎస్ ప్రాంతాల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జోన్-1కు చెందిన 110మంది పోలీసులు అధికారులు, సిబ్బంది 62 బృందాలుగా (సెర్చ్ టీమ్స్ 35, కటాఫ్ టీమ్స్ 11, లిఫ్టింగ్ టీమ్స్ 16) విడిపోయి అణువణువూ గాలించారు. 26 అనుమానితుల ఇళ్లతో పాటు 45 వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు, రికార్డులు లేని 26వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సీతమ్మధార: తగాదాలు, సెటిల్‌మెంట్‌లో తల దూర్చకుండా ఎవరి పని వారు చేసుకోవాలని రౌడీ షీటర్లకు ఎసిపి లక్ష్మణమూర్తి సూచించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి మాట్లాడుతూ, అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐ ఎస్.విజయకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

'గద్దర్ పాట శక్తివంతమైనది'



'ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో' మాట్లాడుతున్న గద్దర్ కుమార్తె వెన్నెల

ప్రజాశక్తి-సీతమ్మధార : గద్దర్ పాట శక్తివంతమైనదని, ప్రభుత్వాలనే గడగడలాడించిన చరిత్ర ఉందని గద్దర్ కుమార్తె వెన్నెల అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఆదివారం 'ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో' కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు, కళా సంస్థలు, మేధావులు, విద్యార్థినీవిద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో వెన్నెల మాట్లాడుతూ, సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాల కోసం గద్దర్ అనేక పాటలు రాశారన్నారు. జీవించినంత కాలం పాట కోసమే బ్రతికారని చెప్పారు. ఆయన రాసిన పాటలు అనేక ఉద్యమాలకు ఊపిరి పోశాయన్నారు. ఈ సందర్భంగా అనేక మంది కళాకారులు ఆటపాటలతో పౌర గ్రంథాలయములో కదం తొక్కారు. గద్దర్ రాసిన పాటలు పాడి, ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, డాక్టర్ అర్జున, మాటూరి శ్రీనివాస్, గంటా మోహనరావు, సినీ దర్శకులు సత్యారెడ్డి, వంగపండు దుష్యంత్, ఆవాల రమేష్, బొడ్డు కల్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో తెనుగుపూడి గురుకుల విద్యార్థుల ప్రతిభ



చిత్రలేఖనంలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రజాశక్తి- దేవరాపల్లి : కొక్కిరాపల్లి అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 18న నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్ పోటీల్లో తెనుగుపూడి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని సీనియర్స్ ఆర్ట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి కె.ప్రవీణ్, 10వ తరగతి విద్యార్థి కే సుధీర్ ఆర్ట్ విభాగంలో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచి డిసిఒ ఎస్ రూపవతి నుంచి మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారని, గురుకులం ఆర్ట్ ఉపాధ్యాయుడు జి అర్జునరావు తెలిపారు. వీరు జోనల్ స్థాయిలో జరిగే ఆర్ట్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్స్‌కు అర్హత సాధించారని డిసిఒ రూపావతి తెలిపారు. గురుకుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పి రఘు, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఇరట నరసింహమూర్తి అభినందించారు. విద్యార్థులను మంచి చిత్రకారులుగాతీర్చిదిద్దిన ఆర్ట్ ఉపాధ్యాయుడు జి. అర్జునరావును అభినందించారు.

వాలాబు పంచాయతీ సమస్యలపై వినతి



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం ఇస్తున్న వాలాబు సర్పంచ్

ప్రజాశక్తి-దేవరాపల్లి : వాలాబు పంచాయతీ పరిధిలో ఉన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి స్థానిక సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి, బుజ్జి ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. దేవరాపల్లి నుంచి వాలాబు రోడ్డు నిర్మాణం చేయాలని, దేవరాపల్లి నుంచి వాలాబుకు బస్సు సౌకర్యం కల్పించాలని, నగరంపాలెంలో అసంపూర్తిగా ఉన్న జలజీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని, మైదాన ప్రాంతం గిరిజనులను ఐదో షెడ్యూల్లో చేర్చాలని కోరుతూ ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోడేల వెంకటలక్ష్మి, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం సన్యాసిరావు , పి. కృష్ణ, జనార్ధనరావు, టి. శ్రీరామ్ పాల్గొన్నారు.


తాతయ్యబాబుకు ఘన సత్కారం



తాతయ్య బాబుని సన్మానిస్తున్న కాపు సంఘ నాయకులు

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును ఆదివారం అనకాపల్లి జిల్లా తూర్పుకాపు సంఘం అధ్యక్షులు పలకా రాము, కోరుకొండ సాంబశివరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గోవిందరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, పాండ్రంకి సత్యారావు, కోట్ని అయ్యన్నదొర, జాజుల రమేష్, సకలా గోవిందరావు, తాడి రామకృష్ణ, తిమ్మాపాత్రుని రమేష్, యలమంచిలి రమణబాబు, తాకాశి సత్యందొర, తలారి లక్ష్మీప్రసాద్, నల్లల శ్రీనివాసరావు, బోడాల వేణుగోపాల్, గండెం శ్రీరామమూర్తి, పిల్లా రాజు తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లాకు చెందిన హౌసింగ్ అధికారులు తాతయ్యబాబును సన్మానించారు.

నిస్వార్థ నాయకుడు పివి.రమణ



రమణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -మునగపాక: నిస్వార్థ ప్రజా ఉద్యమ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పివి రమణ 105వ జయంతిని ఆదివారం మండల కేంద్రం మునగపాకలో ఘనంగా నిర్వహించారు. పివి.రమణ విగ్రహానికి కూటమి, వైసిపి, సిపిఎం నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జమీందారీ కుటుంబంలో జన్మించిన పివి రమణ ఆర్భాటాలకు, ఆడంబరాలకు దూరంగా ఉండేవారన్నారు. గ్రామంలోని మునసబ్ గా, పిఎసిఎస్ అధ్యక్షునిగా, ఆర్ఇసిఎస్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా అనేక పదవులు అధిరోహించి, ప్రజాసేవే పరమావధిగా సాధారణ జీవితం గడిపారన్నారు. ఆయన కమ్యూనిస్టు భావాలను, సిద్ధాంతాలను ఎక్కువగా ఇష్టపడే వారన్నారు. నాటి కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీ కాలంలో ఇల్లు వీడి కుటుంబానికి దూరంగా ఉంటూ అజ్ఞాతంలోకి వెళ్లి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరు సలిపారన్నారు.

నల్ల బెల్లంపై నాటి ప్రభుత్వం విధించిన ఆంక్షలను వ్యతిరేకించడమే కాకుండా, చెరకు క్రషర్లకు ఉచిత విద్యుత్తు అందించాలని, అనకాపల్లి విద్యుత్తు కోఆపరేటివ్ సొసైటీని ఆర్ఇసిఎస్ సాకారంలో కొనసాగాలని నాడు ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన పివి రమణ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాడి ముసలినాయుడు, దాడి శివ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, కాండ్రేగుల రాము, సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, రమణ కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు పూర్వ విద్యార్థుల చేదోడు



చనిపోయిన మిత్రుల పిల్లలకు ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- అచ్యుతాపురం : అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తాము చదువుకున్న స్కూల్‌లోనే జరిగింది. తమ బ్యాచ్‌కు చెందిన ఇద్దరు మిత్రుల అకాల మరణం సమాచారం తెలుసుకున్న పూర్వ స్నేహితులంతా కలుసుకుని, ముందుగా పరస్పర ఆలింగనంతో క్షేమసమాచారాలను తెలుసుకున్నారు. తమతో కలిసిమెలిసి చదువుకున్న మన తోటి స్నేహితులు అకాలమరణంతో వారి కుటుంబాలకు, పిల్లలకు మానవతా దృక్పథంతో అండగా నిలవాలని నిర్ణయించారు. తోటి విద్యార్థులు చొప్ప బాలకృష్ణ, అల్లు సంధ్యారాణి మృతి పట్ల నివాళులు అర్పించారు. వారు లేని లోటు స్నేహితులకు తీరనిదిగా భావించారు. బాలకృష్ణ సంధ్యారాణి పిల్లలకు ఆర్థికంగా అండగా నిలవాలని భావించి రూ. 75 వేల ఫిక్స్ డిపాజిట్ చేసి పత్రాలను వారికి అందజేశారు. తోటి విద్యార్థుల కుటుంబాలు బాగుండాలని, వారికి సహాయ సహకారాలు అందించాలని తద్వారా తమ స్నేహం కలకాలం జీవించి ఉండాలని నిర్ణయానికి వచ్చారు. పూర్వవిద్యార్థుల ఔదార్యాన్ని పలువురు ప్రశంసించారు.

నేడు అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరుగునున్నదని ఎంపిడిఒ కె.వి నరసింహారావు అన్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరుగు 14వ సాధారణ సర్వసభ్య సమావేశా కార్యక్రమానికి సర్పంచులు, ఎంపిటిసి తమ గ్రామాల్లోసమస్యలను సమావేశ వేదిక దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కూల్చేసిన ఇంటిని పరిశీలించిన ధర్మశ్రీ



రెవెన్యూ అధికారులు కూల్చిన ఇంటిని పరిశీలిస్తున్న ధర్మ శ్రీ

ప్రజాశక్తి -చోడవరం : ఎల్‌పిసి మంజూరు చేసిన రెవెన్యూ అధికారులే, పేద మహిళ ఇల్లు నిర్మించుకున్న తర్వాత దాన్ని పునాదులతో కూల్చేయడమేంటని మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రశ్నించారు. ఆదివారం రెవెన్యూ అధికారులు కూల్చేసిన ఇంటిని పరిశీలించి, బాధిత మహిళను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2018లో గాంధీ గ్రామానికి చెందిన ఎలిశెట్టి పద్మ అనే మహిళకు చోడవరం రెవెన్యూ అధికారులు ఇంటి స్థలం ఎల్‌పిసి మంజూరు చేశారన్నారు. అదే స్థలంలో ఇంటిని నిర్మించుకుంటే, టిడిపి నేతలు ఫిర్యాదు చేశారని ప్రస్తుత తహశీల్దార్, డిటిలు దాన్ని కూలగొట్టడం దుర్మార్గమన్నారు. దీనిపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని, బాధిత మహిళకు నష్టపరిహారం అందించడంతోపాటు కూలగొట్టిన స్థానంలో ఇంటిని నిర్మించి ఇవ్వాలని కోరారు. బాధిత మహిళకు అండగా వైసిపి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి గాడి కాసు, జడ్‌పిటిసి మారిశెట్టి విజయ శ్రీకాంత్, డిసిఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవాక సత్యారావు, గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు, శంకరరావు పాల్గొన్నారు.

అభిజిత్ లేఆఫ్ ఎత్తేయాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అభిజిత్ కార్మికులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అభిజిత్ కంపెనీ లేఆఫ్‌ను ఎత్తేయాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అచ్యుతాపురం మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కె సోమునాయుడు మాట్లాడుతూ అభిజిత్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి వారం రోజులౌతున్నప్పటికీ, ఇప్పటి వరకు కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతోపాటు ఇఎస్ఐ, పిఎఫ్, బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అభిజిత్ కార్మికుల సమస్యలపై దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బదిలీ ఎస్‌పి దీపికకు ఆత్మీయ వీడ్కోలు



ఎస్‌పి దంపతులను సత్కరిస్తున్న పోలీస్ సిబ్బంది

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసులు ఆధ్వర్యంలో ఇటీవల బదిలీ అయిన జిల్లా ఎస్‌పి ఎం.దీపికను పట్టణంలోని పెంటకోట ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు, సత్కారాలు నిర్వహించారు. విజయనగరం జిల్లా ఎస్‌పిగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో అనకాపల్లి ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన దీపిక, మూడు నెలలు స్వల్ప వ్యవధిలో పాలనలో తనదైన ముద్ర వేశారు. గంజాయి అక్రమ రవాణాపై దాడులు నిర్వహించడం, గంజాయి కేసుల్లోని తప్పించుకుని తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయడం, ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేసి రోడ్డు ప్రమాదాలు నిలువరించారు.

శాంతిభద్రతలు పరిరక్షించడంలో అధికారులకు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఇప్పుడు బదిలీపై కాకినాడ, 5వ బెటాలియన్ కు కమాండెంట్ గా వెళుతున్న సందర్భంగా జిల్లా అధికారులు ఎస్పీ ఎం.దీపికతో పాటు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన జిల్లా అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్ రావు, డిఎస్‌పిలు బి.అప్పారావు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, పి.నాగేశ్వరరావు, విశాఖ నార్త్ జోన్ ఎసిపి ఎస్.అప్పలరాజు, ఎఒ ఎ.రామ్‌కుమార్, పలువురు సిఐలు, ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ ఎల్‌పిసితో ఇంటి నిర్మాణం

- అక్రమమని నిర్ధారణ కావడంతో కూల్చివేత

ప్రజాశక్తి -చోడవరం : నకిలీ ఎల్‌పిసితో ఇంటి నిర్మాణం చేపట్టినట్లు విచారణలో స్పష్టం కావడంతో అక్రమనిర్మాణాలను తొలగించామని స్థానిక తహసిల్దార్ ఎ.రామారావు తెలిపారు. నర్సీపేట రెవెన్యూ పరిధిలో ఇద్దరు వ్యక్తులు భూమిని ఆక్రమణ చేసి నిర్మాణాలు చేపట్టారని, దీనిపై అగస్టు నెలలో ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌తోపాటు,జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల మేరకు విచారణ చేపట్టామన్నారు. తమ దర్యాప్తులో ఆక్రమణలు వాస్తవమని రుజువు కావడంతో ఎపి భూఆక్రమణల చట్టం ప్రకారం ఆక్రమ నిర్మాణాలను తొలగించామన్నారు. దీనికి ముందుగా చట్టం ప్రకారం ఆక్రమణదారులకు సెక్షన్ 7,సెక్షన్ 6 నోటీసులు జారీ చేశామని, వారం రోజుల నిర్ణీత వ్యవధిలో రాతపూర్వక సమాధానం రాకపోవడంతో నిబంధనల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించామని స్పష్టం చేశారు.

పెద్దేరు వంతెనపై ట్రాఫిక్ జామ్



పెద్దేరు పాత వంతెనపై భారీగా నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- వడ్డాది : వడ్డాది పెద్దేరు వంతెనపై ఆదివారం ఉదయం ట్రాఫిక్ జామ్ అయింది. పక్కనే ఉన్న కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో అనివార్యంగా శిథిలావస్థకు చేరుకున్న ఇరుకుగా ఉండే పాత వంతెన పైనుంచే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సి పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం వడ్డాదిలో వారపుసంత కావడంతో సంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారుల వాహనాలతో వంతెనపై రద్దీ ఏర్పడింది. మరోవైపు .వాహనదారులు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగించడంతో వంతెన మధ్యలో ట్రాఫిక్ జామ్ అయి నిలిచిపోయాయి. దీంతో వాహనదారులతోపాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక యువత జోక్యం చేసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలతో పెద్దేరు రిజర్వాయర్‌కు భారీఎత్తున ఇన్‌ఫ్లో పెరగడంతో నిండిపోయింది. దీంతో రిజర్వాయర్లు నుంచి నీటిని విడుదల చేయడంతో వడ్డాది పెద్దేరు వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో దీనిపై రాకపోకలకు వీలు లేకుండా పోయింది. దీంతో పాత వంతెనపైనుంచే రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

తాచేరు నదిలో మునిగి ఎద్దు మృత్యువాత



మృతి చెందిన ఎద్దు

ప్రజాశక్తి -వడ్డాది : తాచేరు నదిలో మునిగి విజయరామరాజులో కోరిబిల్లి అప్పలనాయుడుకు చెందిన ఎద్దు శనివారం రాత్రి చనిపోయింది. గతనెలలో వరదలకు తాచేరు కాజ్‌వే గండి పడడంతో రైతులు నదినీటిలో దిగి తమపొలాలు వెళ్లివస్తున్నారు. రెండు రోజుల్లో బిఎన్‌రోడ్డులో కాజ్‌వే ఏర్పాటు చేసి రైతులకు దారి ఇస్తామని చెప్పిన ఆర్‌అండ్‌బి అధికారులు ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో నది అవతలకు మేతకు తీసుకెళ్లిన ఎద్దులను శనివారం రాత్రి తిరిగి తెస్తుండగా, ఒకటి నీటిలో మునిగి మృత్యువాత పడిందని, దీనికి ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యమే కారణమని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి, తాచేరు నదిపై కాజ్‌వే పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో వర్షం



బుచ్చయ్యపేటలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం అల్పపీడనం ప్రభావంతో వర్షం కురిసింది. వడ్డాది, బంగారుమెట్టు, దిబిడి, బుచ్చయ్యపేట, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో రోడ్లపై నీరు చేరింది. ఆదివారం పలు పెళ్లిల్లు ఉండడంతో వర్షం వల్ల వారు ఇబ్బందులు పడ్డారు.

అక్రమంగా లారీల్లో ఇసుక తరలింపు

- ఎడ్లబళ్లపై తీసుకొచ్చి, లారీల్లో తరలిస్తున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న పోలీసులు, సంబంధిత అధికారులు



పట్టపగలే లారీల్లో ఇసుక లోడింగ్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని మంగళాపురం, కుముందానుపేట గ్రామాలలో పట్టపగలే ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నాళ్లుగా సమీప నది నుంచి రైతులు ఎడ్లబళ్లపై ఇసుకను తెచ్చి కుప్పలు వేస్తుండగా, ఆ నిల్వల నుంచి అనకాపల్లి విశాఖపట్నం, అచ్యుతాపురం పరవాడ తదితర ప్రాంతాలకు లారీలపై ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని, అయినా రెవెన్యూ, పోలీసులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన నూతన ఇసుక విధానంతో సొంత అవసరాలకు నాటుబళ్లు, ట్రాక్టర్లపై ఇసుక రవాణా చేసుకోవచ్చని ఆదేశాలిచ్చినప్పటికీ, అంతకుముందు నుంచే దీన్ని అదునుగా చేసుకుని ఇసుకను నది నుంచి తీసుకొచ్చి కుప్పలు వేస్తున్నారని , తర్వాత ఆయా కుప్పల నుంచి లారీల్లో తరలించడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు.. ఒక్కో బండి ఇసుకకు రూ.300 నుంచి రూ.400లకు కొనుగోలు చేసి ఒక్కో లారీలో 12 బళ్ళు ఇసుకను నింపుకొని తరలిస్తున్నారని, . పట్టణ ప్రాంతాల్లో లారీ ఇసుకను రూ.20వేల నుంచి రూ.25వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని అంటున్నారు. ప్రభుత్వం ఆదేశాలకు వక్రభాష్యం చెపుతు ఇసుక అక్రమార్కులు యథేచ్ఛగా సాగిస్తున్న దందాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

29 నుంచి ఆరోగ్య మిత్రల నిరవధిక సమ్మె

ఎపి ఎన్‌టిఆర్ వైద్యసేవ ఆరోగ్యమిత్ర కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎదుగూబొదుగూ లేని వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారానికి డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్,కార్పొరేట్ ఆసుపత్రులలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలంతా ఈనెల 29 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జీ కనకం స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అనకాపల్లి కోడిగంటి గోవిందరావు భవన్‌లో ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు వైఎన్ భద్రంతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ, ఈనెల 14న గుంటూరులో ఎన్టీఆర్ వైద్యసేవ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ లక్ష్మి షాకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ గోవింద ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో వైద్యమిత్రలు, టీం లీడర్లు, జిల్లా మేనేజర్లు, ఆఫీస్ అసోసియేట్లు, జిల్లా మానిటరింగ్ కేడరుకు కనీస వేతనాలు అమలుపై ట్రస్ట్ అధికారులు, రాష్ట్ర వైద్యశాఖ అధికారులు వద్ద ప్రస్తావించగా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఫీల్డ్ వర్కర్ల సర్వీసును పరిగణనలో తీసుకొని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. వన్ టైం ఎగ్జామ్‌ను ఉపసంహరించుకోవాలని, ఉద్యోగులకు అంతర్గత పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన సిబ్బంది కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగ విరమణ సమయంలో రూ.10 లక్షల గ్రాడ్యుటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించుకుంటే ఈ నెల 29 నుండి వైద్య మిత్రలు నిరవధిక సమ్మెలో పాల్గొనున్నామని తెలిపారు. సమావేశంలో ఆరోగ్యమిత్రల సంఘం జిల్లా నాయకులు నాయుడు, సోమేశు, దుర్గాప్రసాద్, మూర్తి, రమణి, శంకర్, కరుణ, రత్నకుమారి, గన్నేరావు, జయమని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అనకాపల్లికి సీతారాం రాక

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఈ నెల 22న అనకాపల్లి జిల్లా పర్యటనకు వస్తున్నట్టు కమిషన్ ప్రధానకార్యాలయ కార్యదర్శి ఎన్.పద్మజ తెలిపారు. మంగళగిరి నుండి రోడ్ మార్గాన అనకాపల్లి చేరుకుని, 10.30గంటలకు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి,న జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై చర్చిస్తారన్నారు. 11.30 గంటలకు జిల్లా ఎస్‌పితో సమావేశమై పోక్సో చట్టం అమలు,బాల్య వివాహాల నివారణపై చర్చిస్తారన్నారు. మధ్యాహ్నాం 12.30 గంటలకు ఆర్‌టిసి ఆర్‌ఎం, డిపోమేనే.జర్లతోనూ, 2.30గంటలకు జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో కార్మిక శాఖ చేపడుతున్న చర్యలపై డిప్యూటీ లేబర్ కమిషనర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లతో సమీక్షిస్తారన్నారు.అంగన్వాడీ కేంద్రాలు,ప్రైవేటు,కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలను ఆకస్మిక తనిఖీ చేస్తారన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు

ప్రజాశక్తి- కె. కోటపాడు: మండలంలోని గొండుపాలెం గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. గౌరీ పరమేశ్వరుల మండపం వద్ద ప్రతిరోజు రాత్రి భక్తి కార్యక్రమాలు మహిళా కోలాటాలు నిర్వహిస్తున్నారు. గౌరీ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో సోమవారం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు నిర్వహించనున్నారు. 11 రోజులపాటు నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ఉత్సవం చివరి రోజు అన్నదానం, అనంతరం నిమజ్జనోత్సవం ఉంటాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

జనావాసాల్లో మద్యం దుకాణం వద్దు

ప్రజాశక్తి-విఆర్.పురం: రేఖపల్లి పంచాయతీ కేంద్రంలో సాయిబాబా గుడి ప్రార్థన మందిరం, పిహెచ్‌సిలున్న ప్రధాన రహదారిలో జనావాసాల మధ్య ఇరుకైన ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానిక మహిళలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైసిపి హయాంలో అదే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయగా, ప్రజలు ఎంతగా మొరపెట్టుకున్నప్పటికీ, అప్పట్లో అధికారులుగానీ, ప్రభుత్వంగానీ పట్టించుకోలేదన్నారు. దీంతో అటుగా వెళ్లేప్రజలు, ముఖ్యంగా మహిళలు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు అదే ప్రాంతంలో మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేసి, పాతకష్టాలను కొనసాగించాలన్న చర్యలపైస్థానిక మహిళలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనూ అప్పటి కష్టాలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు, నేతలు తగు చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు. మద్యం దుకాణాన్ని జనావాసాలకు దూరంగా ఊరు చివర ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

పలు గ్రామాల్లో 'పల్లె పండగ'



తీడ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-కశింకోట : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసి రైతుల జీవితంలో వెలుగు నింపుతామని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని సుందరయ్యపేట, తీడ, చెరకాం, కన్నూరుపాలెం గ్రామాలలో పల్లె పండుగ గ్రామసభలు నిర్వహించారు. రూ.1.07కోట్లతో తీడ నుండి తోటకూరపాలెం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పీలా గోవింద సత్యనారాయణ ,చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్.రాజు, కూటమి నాయకులు గొంతిని శ్రీనువాసరావు, కర్రి వెంకట సత్యనారాయణ, కాయలు మురళి, పొన్నగంటి అప్పారావు, కూండ్రపు రామునాయడు, కూండ్రపు అక్కు నాయడు, చిటిమిరెడ్డి ఈశ్వరరావు, నైనంశెట్టి రమణ రావు పాల్గొన్నారు.

దేవరాపల్లి: గ్రామాలలో సంక్షేమం అభివద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం పల్లెపండుగలో మండలంలోని వాలాబు దేవరపల్లి నాగయ్యపేట కాశిపురం గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.. ఈ సందర్భంగా నేతలిద్దరినీ కూటమి శ్రేణులు గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ పివిఎస్ఎన్ మాధవ్, మాడుగుల టిడిపి ఇన్చార్జ్ పివిజి కుమార్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రబాబు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, శరకాన సూర్యనారాయణ, పోతల పాత్రుడు నాయుడు, చల్లా నానాజీ, కర్రీ నాయుడు పెద్దాడ వెంకటరమణ, కొమర బాబూరావు, మొల్లి కృష్ణమూర్తి, చల్లా తాతియ్యలు,సబ్బవరపు పెంటమ్మ, ఆదిరెడ్డి వరలక్ష్మి, పోడెల వెంకటలక్ష్మి, కర్రి పుష్ప పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రామన్నపాలెం గ్రామంలో రూ. 20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి , రూ.75 లక్షలతో ఆవరాజాము దోసూరు గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాజీ ఎంపీ పప్పల చలపతిరావు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, బి రాందాస్ రామన్నపాలెం సర్పంచ్ డి నాయుడు బాబు, సిరసపల్లి రమణ, ఎం శ్రీవేణి, జె.నర్సింగరావు, రాజాన సన్యాసినాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, కుండ్రపు వెంకటరమణ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే గ్రామాలు అభివృద్ధి చెందు తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లోచల సుజాత, ఎంపిటిసి రుత్తల రామకృష్ణ, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ బొడ్డు పోతురాజు, తెలుగు యువత జనరల్ సెక్రటరీ నూతిగట్టు అప్పలరాజు, పంచాయతీ సెక్రటరీ శ్రీను ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాధిక, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఝాన్సీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గొలుగొండలో శంకుస్థాపన చేస్తున్న వేణుగోపాల్

పాల సేకరణ ధర తగ్గింపుపై ఆందోళన

-29న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - చీడికాడ: ఎండనక వాననక శ్రమించి పశువులను పెంచి పాలు పోసిన రైతులకు మొండి చేయి చూపించడం ఎంతవరకు సబవని మాజీ సర్పంచ్ నానాజీ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని అడవిల అగ్రహారం గ్రామంలో విశాఖ డైరీ యాజమాన్యం పాల సేకరణ రేట్లు తగ్గించడంపై గ్రామ రైతులతో పాల సంఘం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు రోజంతా శ్రమించి ఎండ వానలో వారి కాయ కష్టాన్ని శ్రమగా పెట్టి పశువులను పెంచి పాలు పోస్తే విశాఖ డైరీ యాజమాన్యం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి పాల రేట్లు తగ్గించడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆవు పాల రేట్లు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ డైరీ పశువుల దానా రేట్లును విపరీతంగా పెంచి రైతుల నడ్డి విరుస్తుందన్నారు. యాజమాన్యం తమ నిర్ణయాన్ని మార్చుకొని ఆవు పాలకు రేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చీడికాడలో నినాదాలు చేస్తున్న రైతులు

ఎస్ రాయవరం : విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు ధర పెంచాలని, ఈనెల 29 న విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం (గాజువాక)లో మహా ధర్నా నిర్వహించనున్నట్లు ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్ అప్పలరాజు తెలిపారు. ఆదివారం మండలంలో ధర్మవరం గ్రామం పాలకేంద్రం వద్ద రైతులతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాడి రైతులు ఆరుగాలం కష్టపడి పాలు ఉత్పత్తి చేస్తున్నారని, పెరిగిన మేత, దాణా ఖర్చులతో విశాఖ డెయిరీ రైతులకు ఇస్తున్న పాల సేకరణ ధర గిట్టుబాటు కాక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటువంటి తరుణంలో పాల సేకరణ ధర పెంచి రైతులను ఆదుకోవాల్సిన విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధర తగ్గించడం సరైంది కాదన్నారు. విశాఖ డెయిరీ యాజమాన్యం ఏక పక్షంగా ఈ నిర్ణయం తీసుకుని రైతులకు తీవ్రంగా అన్యాయం చేస్తుందన్నారు. ఆవు పాల ధరలు పెంచి యధావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టానికి తగ్గట్టు గా బోనస్ చెల్లించాలన్నారు. ఈ ధర్నాలో పాడిరైతులు పాల్గోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోపాడి రైతులు పి.శ్రీను, బి.నరసింగరావు, జీ.నాయుడు, కె. సూర్యనారాయణ, పి.నూకరాజు, ఏ.శ్రీను పాల్గొన్నారు.


ఎస్.రాయవరంలో ఆందోళన చేస్తున్న నాయకులు

మునగపాక: ఆవుపాల సేకరణ ధరలను విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించడాన్ని నిరసిస్తూ, ఆందోళన ఉధృతం చేస్తామని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని చూచుకొండ, గణపర్తి పాల కేంద్రాల వద్ద పాడి రైతులు, ఎపి రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,. మండలంలో మెజార్టీ రైతులు పశు పోషణ జీవనాధారంగా ఉన్నారని, ఇటువంటి పరిస్థితుల్లో ఆవు పాల ధరను లీటరుకు రూ.మూడు తగ్గించడం దుర్మార్గమన్నారు. తగ్గించిన పాలధరను యథావిధిగా పెంచడంతోపాటు రైతులకు గిట్టుబాటు అయ్యేలా కార్యక్రమాలను చేపట్టి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విశాఖ డెయిరీకి ఉన్నపేరును నిలబెట్టాలని కోరారు. దీనిపై ఈ నెల 29న విశాఖలోని విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చంరిచారు. కార్యక్రమంలో గణపర్తి పాల సంఘం అధ్యక్షులు కాండ్రేగుల త్రినాధరావు, పాడి రైతులు కాండ్రేగుల నాయుడు, పెంటకోట సోమనాయుడు, చదరం అప్పలనాయుడు, చదరం శ్రీను, ఆడారి లక్ష్మి, పెంటకోట వరలక్ష్మి పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న పీడీ

అందుబాటులోకి ఒఎన్‌డిసి ఉత్పత్తులు

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంతాల నుండి సైతం అమెజాన్ వంటి సంస్థలతో పోటీగా ఓఎన్‌డిసి ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి తెలిపారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలో వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. ఓఎన్‌డిసి ఉత్పత్తుల వివరాలను సిసి లను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌జి సంఘాల వారు అత్యధికంగా ఆహార తయారీ ఉత్పత్తులతో పాటు దీర్ఘకాలికంగా కాల పరిమితి ఎక్కువగా ఉండే ఉత్పత్తులు తయారీ పట్ల దృష్టి సారించాలన్నారు. ఆన్లైన్ ద్వారా అమ్మకాలు చేపట్టే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1277 ఎస్‌హెచ్‌జి సంఘాల ద్వారా పలు ఉత్పత్తులు మండలం నుండి 52 సంఘాల ద్వారా వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు తెలిపారు. 2024-25 కు గాను మ్యాన్ ఫ్యాక్చరింగ్ విభాగానికి 133 మందికి 3.5 కోట్లు, శ్రీనిధి ద్వారా 98.5 కోట్ల రుణాలు అందజేశామని తెలిపారు. డ్వాక్రా మహిళలకు ఐదు లక్షల వ్యక్తిగత రుణాలుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇంకా రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

భూ కేటాయింపుల రద్దుపై హర్షం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: శారదాపీఠం భూములను వెనక్కి తీసుకోవాలన్న ప్రభుత్వ నిర్ణయం పై నర్సీపట్నం విదసం ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేశారు. సిబీఎం కాంపౌండ్ సమీపంలో ఆదివారం ఐక్యవేదిక చీఫ్ అడ్వైజర్ ఎల్. యల్లాజీ మాట్లాడుతూ, భూములు వెనక్కి తీసుకునే ప్రక్రియ త్వరిత గతిన ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు.ఈ భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం విధసం ఐక్యవేదిక కమిటీ రాష్ట్ర నాయకులు ఫ్రాన్సిస్. మట్ల అప్పారావు, మల్లేశు, అల్లంపల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

నీతి కథలపై చర్చా గోష్టి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంధాలయంలో ప్రతి ఆదివారం జరిగే చదవడం మాకిష్టం కార్యక్రమం చాలా బాగుందని విద్యార్థులు తెలియజేశారు. ఆదివారం గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో నిర్వహించిన చదవటం మాకిష్టం. కార్యక్రమంలో భాగంగా గొలుగొండ మండలం ఎల్లవరం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులతో లైబ్రేరియన్ దమయంతి పాఠశాలలో చేసిన మంచిపనులు,. నీతికథలపై చర్చా గోష్టిని నిర్వహించారు. కథలో ఉన్న నీతి ప్రకారం జీవించాలన్నారు.

ఘనంగా ముస్లిముల పండగ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ముస్లిం గ్రామాల్లో ఆదివారం గ్యార్మీ షరీఫ్ ఉత్సవాన్ని ముస్లిం సోదరులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసి చందనం పూసిన జెండాలను గుర్రాలపై వేసి ఊరేగించారు. అనంతరం దర్గాకు వెళ్లి జెండాలు ఉంచారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.


పండుగను ఆచరిస్తున్న ముస్లిములు

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-గొలుగొండ: అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని కేడిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీపావళి పండుగను పురస్కరించుకొని బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరన్నారు. అనుమతులు లేకుండా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనుమతులు లేకుండా విక్రయాలు చేస్తే 9440904240 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ఎస్ఐ తారకేశ్వరరావు


నేడు శాంతియుత ర్యాలీకి తరలిరండి

-మాజీ ఎమ్మెల్యే గణేష్


ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మండలంలో గబ్బాడ ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను ఉచితంగా ఇవ్వాలని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇసుకను ఉచితంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. దీంతో నెల 21న సోమవారం ఉదయం 10 గంటలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే శాంతియుత ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తాము చేపడుతున్న శాంతి ర్యాలీ ప్రకటన విని 19న రాత్రి సమయంలో కొబ్బరికాయ కొట్టి టన్నుకు 1165 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. డబ్బులకు కాకుండా ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఈ ర్యాలీలో పాల్గొవాలని కోరారు.



పంపిణీ కాని కందిపప్పు

బియ్యం, పంచదారకే పరిమితం

ప్రజాశక్తి- కోటవురట్ల: కూటమి ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే పౌర సరఫరాల సంస్థ ద్వారా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచుతామని ఊదరగొట్టింది. నేటికీ కూడా కనీసం కంది పప్పును కూడా రేషన్ ద్వారా సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. అక్టోబర్ నెలకు సంబంధించి కందిపప్పు అరకొరగా గోదాములకు రావడంతో వచ్చిన ఆ కందిపప్పు కూడా ఎవరో తెలియలేదు. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ బండి ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేశారని రేషన్ లబ్ధిదారులు తెలిపారు. అరకొర కందిపప్పును ఏ విధంగా కార్డుదారులకు పంపిణీ చేశారో స్పష్టత లేదు.



15857 తెల్ల రేషన్ కార్డులు ఉండగా కేవలం 4000 కందిపప్పు ప్యాకెట్లు మాత్రమే గోదాముకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వచ్చిన ఆ కొద్దిపాటి కందిపప్పు ఎవరికి అందజేశారని తెల్ల రేషన్ కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ పై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడంతో ఇష్టారాజ్యంగా సరఫరా చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, అరకిలో పంచదార మాత్రమే సరఫరా అవుతున్నాయి. ఒక్కోనెల పంచదార కూడా రాలేదని కార్డుదారులు తెలిపారు.అధికారులు, నాయకులు ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


శ్రమదానం చేస్తున్న గిరిజనులు

గిరిజనుల శ్రమదానం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని రత్నంపేట పంచాయతీ పనసలపాడు ఆదివాసీ గిరిజనులు శ్రమదానంతో రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగి రోడ్డు కుదించుకుపోవడమే కాకుండా వచ్చి పోయే వాహనాలు కనిపించక ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో గిరిజనులు ఐక్యతగా తుప్పలను తొలగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు గెమ్మెలి చిన్నబ్బాయి, వంజి మంజిల, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

- బోల్తా పడుతున్న లారీలు - అవస్థల్లో వాహనదారులు



బురదరోడ్డులో కూరుకు పోయిన లారీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత నుండి పాటిమీద రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసం అయ్యింది. టోల్ గేట్ ఫీజు తప్పించుకునేందుకు భారీ వాహనాలు ఈ రహదారి గుండా రాకపోకలు సాగించడంతో రోడ్డు ఎక్కడికక్కడ గోతులు మయంగా మారింది. దీంతో, స్థానిక ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై కాగిత- చినదొడ్డుగల్లు మధ్య టోల్ గేట్ ఉంది. లారీ డ్రైవర్లు టోల్ గేట్ ఫీజు తప్పించుకునేందుకు భారీ వాహనాలు, లారీలను గ్రామీణ ప్రాంతాలైన కాగిత, పాటిమీద, వేంపాడు మీదుగా వెళ్లే రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఈ మార్గంలో వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు ధ్వంసం అయ్యింది. ఎక్కడికక్కడ గోతులు పడటంతో భారీ వాహనాలు బోల్తా పడుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా లారీలు బోల్తా పడటంతో స్థానిక గ్రామీణ ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.



బోల్తా పడిన లారీ

భారీ వాహనాలకు రోడ్డు ధ్వంసం కావడంతో, వర్షం వచ్చినప్పుడల్లా వర్షపు నీరు గోతులలో నిలిచిపోతుందని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. భారీ వాహనాలు, లారీలు నిత్యం రాకపోకలు సాగించడంతో రోడ్డు అతి తక్కువ రోజుల్లోనే ధ్వంసం అయ్యిందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి భారీ వాహనాలు, లారీలను ఈ రహదారి గుండా రానివ్వకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.



తనిఖీ చేస్తున్న సివిల్ జడ్జి సూర్యకళ

హాస్టళ్లను తనిఖీ చేసిన న్యాయమూర్తులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట ఎస్సీ బాలుర వసతిగృహం, రావికమతం బీసీ బాలుర, బాలికల వసతి గృహాలను, గర్ణికం కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను ఆదివారం చోడవరం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకళ తనిఖీలు చేసారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే కాస్మోటిక్స్ తదితర వస్తువులు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వసతి గృహం పరిసరాలు, వసతి గదులు, స్టాక్ రూమ్, వంట గది పరిశీలించారు. కొత్తకోట వసతి గృహం మరమ్మతులకు గురైందని, దీనిపై ప్రపోజల్ పెట్టామని సిబ్బంది ఆమె కు తెలిపారు. కొత్తకోట వసతిగృహంలో 93 మంది విద్యార్థులకు గాను 65మంది మాత్రమే ఉండటం పై స్థానిక సిబ్బందిని ప్రశ్నించారు. హైకోర్టు ఆదేశాల మేరకు వసతి గృహాలను తనిఖీ చేసి సమస్యలపై నివేదిక తయారు చేసి పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆమె వెంట రావికమతం ఎస్ఐ రఘువర్మ, కొత్తకోట ఏఎస్ఐ బాలయ్య తదితరులు ఉన్నారు.

నక్కపల్లి: నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆదివారం ఎలమంచిలి సివిల్ కోర్టు సీనియర్ జడ్జి పి.విజయ సందర్శించారు. డార్మెంటరీ, కిచెన్, బాత్ రూమ్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేక అధికారి షేక్ షలీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో బొట్టా నాగరాజు అధ్యక్షతన నివాళి అర్పించారు. సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ,ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా ఇటీవల మరణించడం చాలా బాధాకరమన్నారు. 90 శాతం అంగవైకల్యం కలిగి ఉండి, చక్రాల కుర్చీ కే పరిమితమైన ప్రొఫెసర్ సాయిబాబా చేయని నేరానికి అతి కఠోరమైన అండా సెల్ జైలులో బంధించడం అన్యాయమన్నారు. మొక్కవోని ధైర్యంతో నిర్దోషిగా బయటకు రావడానికి పోరాటం చేసిన సాయిబాబా పోరాట పటిమ ఎంతో గొప్పదన్నారు.ఈ కార్యక్రమం లో టి.విజయ కుమార్, సీహెచ్ తలుపులు, ఎస్టీ యూనియన్ నాయకులు చిట్టయ్య, సీహెచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

హోం మంత్రి అనిత ఇంట హోమం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని సారిపల్లిపాలెం క్రిష్ టౌన్ హెూం మంత్రి అనిత స్వగృహం వద్ద ఆదివారం రాజశ్యామల సహిత లక్ష్మి నరసింహ స్వామి హెూమం నిర్వహించారు. హెూం మంత్రి వంగలపూడి అనిత హెూమంలో పాల్గొని, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని హెూమం చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



హోమం చేస్తున్న అనిత

వివేకానందనగర్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్

నూతన కార్యవర్గం ఎన్నిక

పార్కు, స్థానిక ప్రాంత అభివృద్ధికి పలు నిర్ణయాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ నగరంలోని మధురవాడ జోన్ - 2 పరిధి ఎండాడ సమీపంలోగల వివేకానందనగర్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన వివేకానందనగర్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (విఎన్‌డబ్ల్యుఅండ్‌సిఎ) నూతన కార్యవర్గం స్థానికులచే ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఉదయం 9 గంటలకు పార్కులో జరిగిన సమావేశానికి ఆ ప్రాంతానికి చెందిన వివిధ రంగాలకు సంబంధించిన 80 మంది హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్కు, ఈ ప్రాంత అభివృద్ధికి పలు నిర్ణయాలు చేస్తూ తగిన కార్యాచరణ తీసుకున్నారు.

నూతన కమిటీ ఇదే..

వివేకానందనగర్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం తొమ్మిది మందితో ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా మంతెన పెద్దిరాజు, అధ్యక్షులుగా సింగిరి మధుసూదనరెడ్డి, కార్యదర్శిగా ఆర్.ఉదయ్, ఉపాధ్యక్షులుగా టిఎస్.నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా కె.వెంకటేష్, భానుమతి, కోశాధికారిగా ఎ.మురళీకృష్ణ, సహాయ కోశాధికారిగా కోటేశ్వరరావు, రుక్మిణి ఎన్నికయ్యారు. వారంతా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో వివేకానందనగర్ పార్కు వాకర్స్ కెఆర్‌కె.మూర్తి, భద్రం, శ్రీహరిరాజు, రాంబాబు, శ్రీనివాసరావు, పాండు రంగారావు, సిఎన్.బాబు, దాట్ల రామరాజు, శివ తదితరులు పాల్గొన్నారు. త్వరలో పార్కు అభివృద్ధికి సలహా కమిటీని ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.



ఎన్నికైన కార్యవర్గంతో హాజరైన సభ్యులు



మధుసూదన్ రెడ్డి




పెద్దిరాజు



ఉదయ్

విద్యుత్ భారాలపై సిఐటియు ధర్నా

ప్రజాశక్తి- చీడికాడ: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీఐటీయూ నేత ఆర్.దేముడు నాయుడు విమర్శించారు. విద్యుత్ భారాలను నిరశిస్తూ మండలంలోని చినకోణం గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే, బాదుడే బాదుడు కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఆనాడు చంద్రబాబు నాయుడు, నాయకులు నిరసన చేపట్టడం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అదే విధంగా పన్నుల భారం ప్రజలపై మోపడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినదానికి గంగిరెద్దుల తల ఊపడం ఏమిటని ప్రశ్నించారు. కుటుంబంలో ఉన్న మహిళలందరికీ నెలకి రూ.1500, రైతు పెట్టుబడి సాయం కింద 20 వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు వంటి హామీలు ఏమయ్యాయన్నారు.ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేస్తామని, మెగా డీఎస్సీ, నిత్యావసర వస్తువులు ధరలు అందుబాటులో ఉంచుతామని కూటమి నేతలు పలికిన హామీలు ఏమి అయ్యాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి కుంబోయిన కన్నబాబు, గిరిజన సంఘం నాయకులు వి.రాము, వార్డ్ మెంబర్ నాగరాజు, చెల్లయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నేతలు, గ్రామస్తులు